క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నియోజక వర్గ ప్రజలకు నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంత్రి పండగ ప్రజల్లో కొత్త వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని తాను భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు మదన్‌రెడ్డి చెప్పారు.

ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలి


సునీతారెడ్డి

నర్సాపూర్: సంక్రాంతి పండగతో ప్రజలందరిలో కొత్త వెలుగులు నిండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి ఆకాంక్షించారు. ఆమె రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి


ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్‌జోన్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మెదక్ ప్రజలకు సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు పతంగులు ఎగురవేసేప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జాతీయ రహదారి నిబంధనలు పాటించాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ రహదారి నిబంధనలను ప్రతీ ఒక్కరూ పాటించాలని కేఎన్‌ఆర్ పెద్దశంకరంపేట ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పేటలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు, వాహనదారులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. భారీ వాహనాలకు వెనక భాగంలో తప్పనిసరిగా సెఫ్టీ రెడ్ స్టిక్కర్‌లు వేసుకోవాలని, జాతీయ రహదారిపై ప్రయాణించే సమయంలో మద్యం సేవించరాదని, రోడ్డు నిబంధనలు పాటించాలని వారు సూచించారు. దీంతో పాటు జాతీయ ప్రధాన రహదారిపై అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇన్సిడెంట్ మేనేజర్ ఖాజా మొయినొద్దీన్, సిబ్బంది జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణ మాజీ ఉప సర్పంచ్ వెంకటేశం తల్లి కిష్టమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శనివారం వెల్దుర్తిలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, శ్రవణ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చిలప్‌చెడ్ యువకులకు ఆమె శనివారం వాలీబాల కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైదానాల్లో క్రీడలు ఆడడంతోనే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. నేటి యువత ఎక్కువగా మొబైల్స్‌తో కాలం గడుపుతూ అనారోగ్యాలకు, మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు దుర్గారెడ్డి, వార్డు సభ్యుడు రామకృష్ణ, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కౌడిపల్లి ఎంపీడీఓ బదిలీ

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఎంపీడీఓ భారతి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ హరీశ్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న భారతి టేక్మాల్ మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్తుండగా పాపన్నపేట మండలంలో విధులు నిర్వర్తించే శ్రీనివాస్‌ను ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. కాగా శనివారం సెలవుకావడంతో సంక్రాంతి పండగ తర్వాత రిలీవ్ కానున్నట్లు ఎంపీడీఓ భారతి తెలిపారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపురెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేకులపల్లి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చొడిచెర్ల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శిగా రాసారపు రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా సూదిరెడ్డి రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రజనీకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లారెడ్డి ఎన్నికయ్యారు.

ఉత్సవాలకు ముస్తాబు

- నేటి నుంచి రామలింగేశ్వరాలయంలో ఉత్సవాలు
- జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన ఆలయం
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన రామలింగేశ్వరాలయం

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామ శివారులోని రామలింగేశ్వరాలయం విశిష్ట ప్రాచుర్యం పొందింది. ఇక్కడ పూజలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరి సిరిసంపదలతో పాటు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ ఆలయంలో ఏటా మకర సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారు.

తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్ గ్రామ శివారులో శతాబ్దాల క్రితం భూమి నుంచి 300 అడుగుల ఎత్తులో రామలింగేశ్వరాలయాన్ని నిర్మించారు. పూర్వకాలంలో శ్రీరామచంద్రుడు దండకారణ్యంలో తిరుగుతున్నప్పుడు ఈ ఆలయంలో పూజలు చేసినట్లు ప్రతీతి. నాటి నుంచి శివాలయం పేరు రామలింగేశ్వరాలయంగా మారినట్లు పురాణ కథల ద్వారా తెలుస్తోంది. ఇక్కడ మునీశ్వరులు తపస్సు చేసిన చోట వాల్మీకం(పుట్ట) ఏర్పడింది. ఈ ఆలయం నుంచి సమీపంలోని చెరువు వరకు సొరంగం ఉంది. మునులు ఈ మార్గం గుండానే వెళ్లి చెరువులో స్నానాలను చేసేవారని ప్రసిద్ధి. ఆలయానికి పశ్చిమ ముఖద్వారం ఉంది. ఇలాంటి ఆలయాలు చాలా అరుదుగా ఉంటాయని పెద్దలు అంటున్నారు. పశ్చిమ ముఖద్వారం కలిగిన శివాలయంలో పూజలు చేస్తే కోరిన కోర్కేలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

మహిమాన్వితుడు..

రామాలింగేశ్వరాలయంలో భగవంతుడిని భక్తి శ్రద్ధలతో పూజించిన వారికి కోరిన కోర్కేలు నేరవేరుతాయని ప్రగాడ విశ్వాసం. దీంతో హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాలతో పాటు ఇతర జిల్లాల భక్తులు ప్రతీ నెల ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, హోమం తదితర పూజలు నిర్వహిస్తున్నారు.

15 నుంచి ప్రత్యేక పూజలు

ఈ నెల 15న ఆదివారం గణపతి పూజ, పున్యాహవచనం, ఆఖండ దీపారాధన, రుద్రాభిషేకం, బండ్లు, బోనాల ఊరేగింపు, 16న సోమవారం స్వామివారికి రుద్రాభిషేకం, దేవతామూర్తులకు అభిషేకం, గోపాల కాల్వలు, 17న మంగళవారం రుద్ర గణపతి, నవగ్రహ హోమం, రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని అర్చకుడు ఆత్రేయశర్మ తెలిపారు. మూడు రోజుల మందు నుంచే చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.


ఆలయ గర్భగుడిలో స్వామివారు

ఘనంగా గోదారంగనాథస్వామి కల్యాణం


చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో ..


నిజాంపేట(మెదక్): కల్యాణంలో అర్చకులు, భక్తులు

నిజాంపేట(మెదక్): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ఆలయంలో, చల్మెడ శ్రీ తిరుమలనాథ స్వామి దేవాలయంలో గోదా రంగనాథ స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పంతులు వైద్య వాసుదేవచారి మాట్లాడుతూ.. స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు ఆలయ అర్చకులు బెల్లంకొండ శ్రీహర్ష చారి, రమణాచారి పంతులు వేదాంతి కృష్ణమాచారి కనుల పండుగగా నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్వసేన ఆరాధన, పుణ్యవచనం, కంకణ ధారణ, మాంగళ్య ధారణ నిర్వహించి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో దంపతులు ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, జిల్లా రైతు సమన్వయ సమితి డైరెక్టర్ భాస్కర్‌రావు, స్థానిక ఎంపీటీసీ బాల్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంటలో.. సర్పంచ్ తమ్మన్నగారి కృష్ణవేణి మధుసుదన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, కంతారెడ్డి చంద్రారెడ్డి, చక్రవర్తి, దొడ్డరాజు, విశ్వనాథం, పంచాంగం రమణ తదితరులు పాల్గొన్నారు.


కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్, విష్ణు ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాయకస్వామి కల్యాణం ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ రాజేందర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్ గుప్తా, ఆలయ భక్త భజనమండలి సభ్యులు శ్రీశైలం, రెడ్డి నర్సింలు, విఠల్, భూషణం, భక్తులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని వేంకటేశ్వర దేవాలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సురేశ్, అర్చకుడు వాసుదేవ్, వార్డు మెంబర్ సంతోశ్, భక్తులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి


వినతిపత్రం ఇస్తున్న కుల సంఘాల నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): వివిధ కుల సంఘాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి శనివారం వినతిపత్రం సమర్పించారు. మండల పరిధిలోని గోమారం పర్యటనకు వచ్చిన వారికి గ్రామంలో కురుమ సంఘం, ముదిరాజ్ సంఘం భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కుల సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. అందుకు చైర్ పర్సన్, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ లావణ్యమాధవారెడ్డి చెప్పారు.

కాంగ్రెస్ సోషల్‌మీడియా కన్వీనర్‌గా ఉదయ్ కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా మెదక్ నియోజవర్గ కోఆర్డినేటర్‌గా మండలంలోని కోర్విపల్లి గ్రామానికి చెందిన సింగమెల్ల ఉదయ్‌కుమార్‌ను నియమిస్తూ టీపీసీసీ స్టేట్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ నవీన్ పెటిమ్ ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నశంకరంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఉదయ్ కుమార్‌ను సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉదయ్ కుమార్ నియామకంపై వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

కేలండర్‌ల ఆవిష్కరణ


చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్ ఆలయంలో కేలండర్ ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం దేవాలయ కేలండర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి గారి వెంకట్‌రెడ్డి, భజన భక్తుల ఆధ్వర్యంలో కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజ్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మాణయ్య, రమేశ్, గణేశ్, శివస్వాములు పాల్గొన్నారు.


కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో మిత్తయ్యల్‌వార్ ఐక్యవేదిక నూతన సంవత్సర కేలండర్‌ను శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ రాజేందర్, సంఘంద నాయకుడు రాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీశైలం, శ్రీనివాస్, విష్ణు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో ముగ్గు వేస్తున్న శ్రావణి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, యువతులు అందమైన రంగవల్లులను వేశారు. పలువురు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. వీరికి రోటరీ క్లబ్ వారు బహుమతులను అందజేశారు.


కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో ..

కొల్చారం(నర్సాపూర్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రం కొల్చారంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఛత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు చిన్న పెద్ద అనే తేడా లేకుండా మహిళలు ఈ పోటీల్లో పాల్గొని ముగ్గులను వేసి తమ ప్రతిభను చాటారు. సర్పంచ్ కరెంట్ ఉమాదే విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో బహుమతులు అందుకున్న వారిలో ప్రవళిక, శ్రీజ, పుష్పలత ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెన్నయ్య, కరోబార్ ప్రభాకర్, యువజన సంఘం అధ్యక్షుడు చౌరిగారి ప్రేమ్, ఉపాధ్యక్షుడు పిట్ల క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని రాఘవానితండాకు చెందిన గిరిజనులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని కట్టెల వెంకటాపూర్ శివారులో సర్వే నంబర్ 55,56లో గిరిజనులపై పెట్టిన కేసులకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణితో భూస్వాములకు లాభం చేకూరుతుందన్నారు. రాఘవానితండా గిరిజనులకు 2007లో ఆ భూములపై హక్కులు వచ్చాయన్నారు. 161వ జాతీయ ప్రధాన రహదారి పక్కన 55,56 సర్వే నంబర్లలో భూములను రియల్టర్లు దక్కించుకోవాలని చూస్తున్నారన్నారు. తమ భూములను కాపాడుకునేందుకు వెళ్లిన గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్‌నాయక్, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, ఎంపీటీసీ రాజునాయక్ తదితరులున్నారు.

న్యాయం చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కట్టెల వెంటాపూర్ శివారులో రాఘవానితండా గిరిజనులకు న్యాయం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రాఘవానితండా వాసులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని కొందరు అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంపై 34 మంది తండావాసులపై కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ విషయంపై మెదక్ ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడి, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, రోమాల సాయిలు తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు అండగా ఉంటుందని శివ్వంపేట జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. శనివారం మండలంలోని పర్కిబండ, తుపాకులపల్లి గ్రామాలకు చెందిన నలుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఇటీవలే మరణించిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున నగదును అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీరాం, ఉపేందర్‌రెడ్డి, నర్సింలు, రాములు, అర్జున్, రవి, ఆంజనేయులు, ప్రభాకర్‌రావు, అశోక్, శ్రీశైలం, బాలకృష్ణ, ప్రవీణ్, సిద్దిరాములు, ఎల్లం, రమేశ్, భాస్కర్, నవీన్ తదితరులున్నారు.


చెక్కును అందిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

పల్లెల్లో పండగ శోభ


మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో భోగి మంటలు వేసిన నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలో సంక్రాంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం భోగి పండగను పురస్కరించుకొని స్థానిక ప్రియాంక కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భోగి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఫణీందర్, మల్లేశం, పరంధాం, జనార్దన్‌గౌడ్, సిద్ధూ, అనిల్, రాజేశ్వరి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు.


కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రం వద్ద..


పెద్దశంకరంపేట(మెదక్): భోగీ మంటల వద్ద కాలనీవాసులు

కానరాని బసవన్న విన్యాసాలు

- ఆదరణ కోల్పోతున్న ఎద్దులాట
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి


గంగిరెద్దులవారు ఎద్దుతో చేస్తున్న విన్యాసాలు (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఒకప్పుడు సంక్రాంతి పండగ వచ్చిందంటే గ్రామాల్లో ఇంటి ముందు గంగిరెద్దుల వారు బసవన్నతో విన్యాసాలు చేయించేవారు. అనంతరం వారికి పెద్దవాళ్లు దుస్తులు, బియ్యం ఇచ్చేవారు. ప్రస్తుతం గంగిరెద్దుల వారికి ఆదరణ కరువై, బసవన్న విన్యాసాలు కనుమరుగైపోతున్నాయి.

- గంగిరెద్దులవారి కుల వృత్తి ఎద్దులను, ఆవులను వలసలు తీసుకెళ్లడం, ఆవే పశువులతో గ్రామాలు, పట్నాల చుట్టూ తిరుగుతూ, వాటిని ఆడిస్తూ ఉండడమే వారి జీవనవిధానం.
- ఏ గ్రామానికైనా వలస వెళితే గ్రామ శివారులో గుడారాలు వేసుకొని అక్కడ వారి పనులు పూర్తి ఆయ్యేంత వరకు అక్కడే ఉండటం, వారి ఆనవాయితీ.
- మండలంలోని సోమక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలో గంగిరెద్దుల గూడెం ఉంది. సుమారు 50 ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి నలుగురు గంగిరెద్దుల వ్యక్తులు వచ్చి స్థిరపడ్డారు. క్రమక్రమంగా ఇదే ప్రాంతంలో గంగిరెద్దుల వారు ఇక్కడే శాశ్వతంగా స్థిరపడ్డారు. వారి జీవన విధాన పద్ధతితో ఈ ప్రాంతం గంగిరెద్దుల గూడెంగా మారిపోయింది. ప్రస్తుతం గంగిరెద్దుల గూడెంలో 60 కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. ప్రధానంగా గంగిరెద్దుల వారి కుల వత్తి ఎద్దులను ఆడించడం, వాటితో విన్యాసాలు చేయడం, వాటిని వలసలు తీసుకెళ్లి అక్కడి గ్రామాల్లో ఆడించడం.
- సంక్రాతి సీజన్ వచ్చిందంటే గంగిరెద్దులగూడెంలో ఉన్న యువకులు, పెద్దలు అందరూ తమ పశువులతో పట్నం వెళ్లి ఒక్కొక్కరూ ఓ కాలనీలో ఎద్దులు ఆడించుకుంటూ జీవిస్తున్నారు. మరికొందరు గ్రామాల్లో ఎద్దులను ఆడిస్తూ ఉంటారు. ప్రస్తుతం వారి ఎలాంటి ఆదరణ లేదు. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే గంగిరెద్దుల విన్యాసాలు అంతరించి పోయి, భవిష్యత్ తరాలు గంగిరెద్దు ఆట అంటే ఏంటి ప్రశ్నించే అవకాశం ఉంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



50 ఏళ్లుగా గంగిరెద్దుల గూడెంలో నివసిస్తున్నాం. మా గూడెం ఇప్పుప్పుడే కొంత అభివృద్ధి చెందుతుంది. కేవలం కుల వృత్తిపైనే ఆధారపడే మాకు ప్రభుత్వం మూడెకరాల భూమి ఇవ్వాలి. అదే విధంగా మా కులవృత్తిని గౌరవించాలి.

– బత్తుల ఎల్లయ్య, గంగిరెద్దులగూడెం

కులవృత్తే మా జీవనం



మేము కుల వృత్తి చేస్తేనే మా కడుపునిండుతుంది. సంక్రాతి పండగ సమయంలో మా పిల్లలు, పెద్దలు అందరం కలసి పట్నానికి వలస వెళ్లి అక్కడ మా కుల వత్తిని ప్రదర్శిస్తూ నాలుగు రాళ్లు వెనకేసుకునేవాళ్లం. ప్రస్తుతం బసవన్న విన్యాసాలకు విలువ ఇవ్వకుండా, మామ్మల్ని భిక్షగాళ్లల చూడడం బాధాకరం.

– అంబయ్య, గంగిరెద్దులగూడెం